# తొలగిన హృదయపు తెర

◆ అనిత వొజ్జల ◆

## సమయం రాత్రి రెండు గంటలు. నగరమంతా గాఢ నిద్రావస్థలో మునిగివుంది.

ఎంత కనులుమూసినా నిద్రాదేవి కరుణించలేదని... విసుక్కుంటూ 'ఇక భరించలేను' అన్నట్లు లేచి కూర్చున్నాడు మునీంద్ర.

ప్రక్కన అతని భార్య గువ్వ పిట్టలా ముడుచుకుని నిద్రపోతుంది అమాయకంగా.

మనసులో ఎంత వద్దనుకున్నా... క్షణం తరువాత ఆపుకోలేక ఆమె వైపు తిరిగి చూసి ... "షిట్" అని విసుక్కున్నాడు.

అతని అసహనానికి, చికాకుకు కారణం ఆమే అని అతని ఉద్దేశ్యం. పెళ్ళప్పుడు ఉన్న అందం ఆమెలో ఇప్పుడు లేదు. ఆమె అందం తరిగిపోయినందువల్లే అతను సంతృప్తిని పొందలేక పోతున్నాడని చాలా రోజులుగా బాధ పడుతున్నాడు. ఆ బాధ కొన్నిరోజులకు అతనికి సమస్య అయి పడిగెత్తిన కూర్చుంది.

ఈ విషయం గురించి ఎన్నోసార్లు మానసిక రోగ నిపుణుని దగ్గరకు వెళ్ళామనుకున్నాడు. కాని మన ఇండియా ఇంకా అభివృద్ధి చెందలేదు. మనము జ్వరము వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్ళినట్లు విదేశాలలో సైకలాజికల్ గా చిన్న అనుమానం వచ్చినా సైక్రియాట్రిస్ట్ దగ్గరికి వెళ్తారట...! కానీ మన దేశంలో మాత్రం చాలా ఇన్‌ఫీరియర్‌గా ఫీలవుతారు. అతడు ఆ కోవకు చెందినవాడే... అందుకే అలా నిశ్శబ్దంలో కూర్చొని ఎన్నోరాత్రులు ఆలోచించసాగాడు.

ఇక భరించలేనట్లు లేచి కిటికీ దగ్గరికి వెళ్ళాడు. 'భార్య అందం తగ్గిపోయింది' అని అతడు తన మనసులో బీజాన్ని నాటు కున్నప్పటి నుండి అతని హృదయానికి ఆ కిటికీయే చేరువయ్యింది.

దిగులుగా కిటికీ ఊచలు పట్టుకొని శూన్యంలోకి చూడసాగాడు.

బయట వెన్నెల పిండారబోసినట్లు ఉంది.

ఆకాశంలో చుక్కలు చంద్రుని చుట్టూ గిలిగింతలతో పరాచికాలు ఆడుతున్నట్లున్నాయి.

నీలాంబరాన్ని పెనవేసుకొని చుంబిస్తూ కనిపించే నీలి సముద్రంలో 'హోరు'మనే సముద్ర ఘోష అతడి చెవుల్లో 'జోరుగా' ప్రతిధ్వనించసాగింది.

అతడు దిగులుగా సముద్రాన్నే చూడసాగాడు. ఇసుక తిన్నెలను చేరాలనే ఆతృతలో విశృంఖలంగా ఎగిసిపడే కెరటాలు చేసే శబ్దం అతని హృదయంలో వాడిగా ఢీకొట్టినట్లయ్యింది.

హఠాత్తుగా కళ్ళు మూసుకున్నాడు.

రెండు క్షణాల తరువాత కళ్ళు తెరిచాడు.

రెండు రెప్పల మధ్య సన్నటి కన్నీటి పొర.

దానిని ఛేదిస్తూ ఎగిసిపడే కెరటాలు జోరుగా తీరం వైపు రాసాగాయి. వెంటనే కిటికీ మూసి తల త్రిప్పాడు. క్షణకాలం పాటు విస్తుపోయాడు.

ఎప్పటినుంచి గమనిస్తుందో అతని భార్య, రెప్ప వేయకుండా అతనివైపే చూడసాగింది.

తొలగిన పైట... రేగిన జుట్టు శివంగిలా వుందామె.

'రుబ్బు రోలును మంచంపై పెట్టినట్లు' అనిపించింది అతనికి.

ఏమీ చెయ్యలేక... కసిగా ప్రక్కనున్న బెడ్ ల్యాంప్‌ను విసిరికొట్టి మంచం పైన వ్రాలిపోయాడు.

"ఏమండి...! నిద్ర రావటం లేదూ...?" అని అడిగిందామె ప్రేమగా భర్తపై చేయివేసి.

"రాకేగా...? కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను...! నీకేమైనా అభ్యంతరమా...?

"లే... లేదు...!" అంది తడబడుతూ.

"ఇక్కడి నా హృదయంలో ఏనుగులు తొండంతో బండలు బ్రద్దలు చేస్తున్నా... తమరు మాత్రం గాఢ నిద్రలో మునిగిపోవాల్సిందే. ఇక పడుకో...!" అంటూ తన పైన వున్న ఆమె చేతిని విసురుగా తీసేసి అటువైపుకు తిరిగి పడుకున్నాడు.

●●●

**ఆకాశంలో చుక్కలు చంద్రుని చుట్టూ గిలిగింతలతో పరాచికాలు ఆడుతున్నట్లున్నాయి**

●●●

అతని హృదయంలోని బాధేమిటో ఆమెకు తెలియదు.

తెలుసుకోవాలని వున్నా భర్తను అడిగేటంత ధైర్యం, చనువు ఆమెకు లేవు.

భర్త తరుచుగా ఇలా కోపగించుకోవడానికి కారణం తెలియని ఆ ఇల్లాలు మనసు మహా సముద్రమయ్యింది.

★ ★ ★

అది మంజీర ఇండస్ట్రీస్ హెడ్డాఫీసు.

## ●●● కాలేజీ రోజుల్లో అందగాడే... కాని ఇప్పుడు ఎంత మారిపోయాడో తెలుసా? ●●●



సమయం పదకొండు దాటి పది నిముషాలైంది.

అప్పటివరకూ తలవంచుకొని తన పని చేసుకుంటున్న మునీంద్ర అలికిడి అవటంతో తలెత్తాడు.

ఆమె లోపలికి వస్తూ కనిపించింది. అతడు కన్నార్పకుండా చూస్తూ వుండిపోయాడు.

మంచి హైటూ, పర్సనాలిటీ, పెద్ద కళ్ళు, పల్చటి పెదవులు నాజూకైన శరీరంతో శిల్పంలా చాలా అందంగా వుందామె. ఆ క్షణమే ఆమెను ఎక్కడో చూసినట్లు అనిపించింది అతనికి.

కానీ... వెంటనే ఫ్లాష్ వెలిగినట్లు అతని సబ్ కాన్షస్ మైండ్‌లో నుంచి బయటికొచ్చిందామె... నా డిగ్రీ క్లాస్‌మేట్ నిహారికా... అనుకున్నాడు.

'కాలేజి బ్యూటీ... అబ్బాయిల ఊహా మదన మనోహరి... నీల మేఘంలో పురివిప్పిన నెమలి వంటి సౌందర్యవతి ఆమె... ఆమెను మరివిపోతే ... ఈ జన్మ ధన్యమవుతుందా!' అనుకున్నాడు.

కనులు మరింత వెడల్పు చేసుకొని చూడసాగాడు.

ఆమె అప్పుడు ఎంత అందంగా ఉందో ఇప్పుడు అలానేవుంది.

'అదే రంగు... అదే రూపం... అవే కొలతలు ... అదే స్ట్రక్చర్ ఎలా మెయిన్‌టెన్ చేస్తుంది.'



## సినిమాల నుంచి సన్యాసం

బీహారి బాబుగా పేరుగాంచిన శత్రుఘన్ సిన్హా హిందీ తెరమీద విలన్‌గా, హీరోగా తనకొక స్థానాన్ని సంపాదించుకున్నాడు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తగా మారిన తరువాత గత కొంత కాలంగా రెండు పడవల మీద ప్రయాణం చేశాడు. అది అంత అనుకూలంగా లేనట్లుంది. చివరకి సినిమా సన్యాసం పుచ్చుకుని పూర్తి సమయాన్ని రాజకీయాలలో గడిపేందుకు నిర్ణయించుకున్నాడట!

అతనికి వెంటనే భార్య గుర్తొచ్చింది... నా భార్య గున్న ఏనుగులా ఎలా మారిందబ్బా... అనుకున్నాడు.

అతనికి వెంటనే అది ఆఫీసని... తన కర్తవ్యం గుర్తొచ్చింది.

ఆమె ఎందుకొచ్చిందని ఆశ్చర్యంగా చూసాడు.

ఆమె అతన్ని గుర్తుపట్టలేదు.

'ఎదురుగా మనిషి వచ్చినా ఉలుకు పలుకూ లేకుండా ఇలా వున్నాడేం— అనుకొని అతని ఆశ్చర్యానికి భంగం కలిగిస్తూ "ఎక్స్‌క్యూజ్ మీ సార్...! ఐ యామ్ నిహారిక. నేను హైదరాబాద్ నుండి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాను. ఇది నా జాయినింగ్ రిపోర్ట్" అంటూ టేబుల్ పై ఆ కాగితాన్ని ఉంచింది.

అతడు దాన్ని పట్టించుకోకుండా ..."నిహారికా...! నువ్వు నన్నింకా గుర్తుపట్టలేదా? నేను డిగ్రీలో నీ క్లాస్‌మేట్ మునీంద్రని" అన్నాడు సంతోషంగా.

ఆమె ఓ క్షణం అతని వైపు తేరిపార చూసి ఆ తరువాత గుర్తుపట్టినట్లు "మునీ...! యూ...! వచ్చినప్పటి నుంచి నిన్ను ఎక్కడో చూసానని అనుకుంటున్నా. కానీ మన కాలేజి రోజులు గడిచిపోయి పదేళ్ళయ్యింది కదూ...! అందుకే గుర్తుపట్టలేదు! ఐయామ్ సారీ!" అంది ఆపాలాజిటికల్‌గా.

"ఇట్స్ ఆల్ రైట్" అని పైకి అన్నా మనసులో ఏ మూలో ఆమె గుర్తుపట్టలేదని కాస్త బాధేసింది.

"సారీ! మునీ...! గుర్తుపట్టనే లేదు! బాగున్నావా...? నువ్వు ఇక్కడే ఉద్యోగం చేస్తున్నావా...? ఇన్ని రోజుల తరువాత కలుసుకున్నందుకు కాస్త ఆశ్చర్యంగానూ చాలా సంతోషంగానూ ఉంది."

"అంతేకాదు! ఇప్పటి నుంచి కలిసి పని చేయబోతున్నాం! నాకు మాత్రం చాలా ఆనందంగా ఉంది. పద! అలా క్యాంటీన్‌కు వెళ్ళి టీ తాగొద్దాం" అన్నాడు.

"ఛలో" అంటూ లేచిందామె.

ఇద్దరూ క్యాంటీన్‌లో ఓ మూల టేబుల్‌పై కూర్చున్నారు.

"అందరికన్నా నువ్వే తొందరగా పెండ్లి చేసుకున్నావ్‌గా! మ్యారేజ్ లైఫ్ ఎలా వుంది" అని అడిగింది ఆమె.

గోరు చుట్టుమీద రోకలి పోటులా వుంది అతని పరిస్థితి.

కొద్దిగా... తడబడుతూ "ఏం బాగో... అంటే... బాగానే వుందిలే...! అయినా... సంసారం శతవిధాల నరకమని పెద్దలు ఏనాడో చెప్పారు" అన్నాడు విషాదంగా.

అతని మొహంలోని భావాలకు, మాటలకు ఆమె విరగబడి నవ్వి " నీ మాట తరహా ఇంకా మారలేదా...! నీకు తెలుసుగా నేను, అక్షిత్ పెండ్లి చేసుకున్నాం..."

"ఆ...! ఆ...!" అన్నాడు. ఒలింపిక్స్‌కు వెళ్ళినట్లు ఎన్ని కష్టాలు పడి, ఎంత మందిని ఓడించి అక్షిత్ ఆమెను గెలిచాడో మునీంద్రకు తెలుసు.

"నీ శ్రీమతిని అడిగానని చెప్పు... ఇక్కడే కదా...! ఓసారి మా ఇంటికి తీసుకురా...!"

"అలాగే...!" అని పైకి అన్నా... 'మధ్యలో ఆ రాక్షసి ఎందుకు' అని మనసులో అనుకున్నాడు.

తమ క్లాసుమేట్స్ గురించి, పరిచయస్తుల గురించి, ఆఫీసు గురించి మాట్లాడుతూ రెండు గంటలు గడిపారు.

కాలేజి రోజులు గడిచిపోయి ఇన్నేళ్ళయినా ఆమెలో అందం కానీ, చలాకీతనం కాని కొంచెం కూడా తగ్గకపోవడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. వెంటనే భార్య గుర్తొచ్చి బాధేసింది.

ఆమె అప్పుడు ఎలా అల్లరిచేస్తూ... ఉషారుగా ఉండేదో... ఇప్పుడు అలానేవుంది.

తను అనుభవించలేనిది మరొకరు అనుభవిస్తుంటే భరించలేని ఓ విధమైన కుళ్ళు అతనిలో మొదలయ్యింది. దీనివల్ల అతనిలో బాధ మరింత ఎక్కువైంది.

"రా! సెక్షన్‌లో అందర్ని పరిచయం చేస్తాను" అన్నాడు మర్నాడు ప్రొద్దున్న.

"నిన్ననే అందరూ బెస్ట్ ఫ్రెండ్స్ అయ్యారు" అంది చక్రాల్లాంటి కళ్ళను త్రిప్పుతూ.

"కాలేజి రోజుల్లోని నీ ఫాస్ట్‌నెస్ ఇంకా తగ్గలేదన్నమాట" అన్నాడు నవ్వుతూ.

"ఆహా...! మరి కాస్త ఎక్కువయ్యింది" అందామె అతని నవ్వులో శృతి కలిపి.

"దట్స్ గుడ్" అన్నాడు.

ఆమె నవ్వుతూనే తన పనిలో మునిగిపోయింది.

కానీ... అతని చేతిలో పెన్ను... టేబులుపై కాగితాలు... మనస్సు అనే సుడిలో పడి కొట్టుకు తిరుగుతున్న ఆలోచనలు ఓ కొలిక్కి రావడం

●●●

**ఆ రోజు నుంచి అతను ఏ రోజూ తన భార్య అందంగా లేదని బాధపడలేదు.**

●●●

లేదు.

అప్పుడే గడియారం టంగ్ టంగ్అంటూ అయిదు గంటలు కొట్టింది.

భారంగా అడుగులు వేస్తూ ఇంటికి నడక సాగించాడు.

తనకు పదడుగుల ముందర 'నిహారిక' మిగిలిన కొలిగ్స్‌తో కలిసి ఏదో చెబుతూ పడి పడి నవ్వుతుంది.

ఆమె లయబద్ధంగా అడుగులు వేస్తున్నప్పుడల్లా హైహీల్స్ చప్పుడు గమనిస్తున్న అతని హృదయం లయ తప్పింది.

అలాగే వెళ్ళి పార్కింగ్ ప్లేస్‌లోని కైనెటిక్ హోండాని స్టార్ట్ వేసుకొని రివ్వున వెళ్ళిపోయింది.

అసలే భార్య అందం తరిగిపోయిందన్న బాధలో వున్న అతనికి నిహారిక తన ఆఫీసుకు వచ్చి... తన కళ్ళ ముందు ఉత్సాహంగా తిరగడం మరింత బాధను కలుగవేసింది.

★ ★ ★

'ఉఫ్' అంటూ నిట్టూర్చి కుర్చీలో కూలబడ్డాడు.

చేతిలో కాఫీతో ప్రత్యక్షమైంది భార్య.

పిప్పళ్ళ బస్తా లాంటి శరీరం... కుమ్ముటోపికి రంగు వేసినట్లు అక్కడక్కడ తెల్లవెంట్రుకలు, జిడ్డుమొహం, మాసిన చీర, మసి బారిన చేతులు ఆ కాఫీ తీసి మొహానికేసి కొట్టాలనిపించింది అతనికి. బలవంతాన ఆ కోరికను అణుచుకొని కాఫీ కప్పు తీసి టేబుల్‌పై పెట్టాడు.

విసురుగా తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు.

''ఏమండి! ఆరోగ్యం బావోలేదా...?'' అని అడిగిందామె.

''బాగానే వున్నానే...! లోపలికి తగలడి నీ పని చూసుకో'' అన్నాడు సీరియస్‌గా.

## కాలేజీ రోజుల్లోని నీ ఫాస్ట్‌నెస్ ఇంకా తగ్గలేదన్న మాట!

ఆమె మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది..

ప్రవర్తనలోనూ... భాషలోనూ అతను ఆమెపై అయిష్టను చూపుతూ... క్షణక్షణం చీదరించుకుంటున్నాడు.

ఇలా రోజులు గడుస్తున్నాయ్.

అతనికి భార్య మీద విసుగు క్రమ క్రమంగా పెరిగిపోసాగింది.

ఓ రోజు సెకండ్ ఫ్లోర్‌లోని స్టోర్ రూమ్‌లోనికి వెళ్ళడానికి మెట్లు ఎక్కసాగాడు.

అక్కడ నిహారిక టేబుల్‌పై కూర్చొని అటు వైపు తిరిగి ఫోన్‌లో మాట్లాడుతుంది.

అందులో తన పేరు దొర్లేసరికి రూమ్‌లోకి అడుగు పెట్టబోతున్న వాడల్లా మంత్రం వేసినట్లు అక్కడే ఆగిపోయాడు.

''ఆ... బాగానే వున్నాను...''

''..........................''

''కాలేజి రోజుల్లో అందగాడే... కాని ఇప్పుడు ఎంత మారిపోయాడో తెలుసా? మొదటిసారి చూసినప్పుడు నేను గుర్తుపట్టనేలేదు...! బట్టతల... చప్పిదవడలు... బారెడు పొట్ట... పేకల్లో జోకర్లా... చూడగానే పొట్ట చెక్కలయ్యేలా నవ్వొచ్చేటట్లు'' అంటూ గట్టిగా నవ్వసాగింది.

గట్టిగా చెంపమీద చరిచినట్లయ్యింది మునీంద్రకి.

జివ్వున రక్తం మొహంలోకి ప్రాకింది.

గిర్రున మొహాన్ని ప్రక్కకు త్రిప్పాడు.

నిలువెత్తు అద్దంలో తన మొహం తనకు భయంకరంగా కనిపించింది.

అప్పుడతను పరివర్తన పొందాడు.

'బట్టతల... చప్పిదవడలు... పెద్దపొట్ట... పేకల్లో జోకర్లా... నేను మాత్రం మారలేదూ! ఉమ్మడి కుటుంబంలో రోజంతా పనే... ఇంటెడు చాకిరీ చేసి... నడుం వాల్చడానికి కూడా సమయ్యముండదు. ఇక నా భార్య తన గురించి పట్టించుకోవడానికి... షోగ్గా తయారవడానికి సమయం ఎక్కడుంది...? అందంగా లేకున్నా... నా కన్నా చాలా ఆకర్షణీయంగా ఆరోగ్యంగా వుంది. చాలా వికృతంగా లేదు. ఎవరి మొహం వారికి తెలియదు. ఇతరులను అనే ముందు ఓ సారి అద్దంలో చూసుకోవాలి' అనుకున్నాడు.

ఆ రోజు నుంచి అతను ఏ రోజు తన భార్య అందంగా లేదని బాధ పడలేదు.

ఇన్ని రోజులు ఇష్టపడే బెడ్‌రూమ్ కిటికీనే ఇప్పుడు తనను పట్టించుకోవడం మానేసాడని శత్రువైంది.

ఇంద్రధనుస్సు నిచ్చెన వేసుకొని చంద్రుడు ఇప్పుడు ఆ కిటికీలోనికి తొంగి చూడాలని ప్రయత్నిస్తున్నాడు.

ఎందుకంటే...

అక్కడ......

బయట సముద్రకెరటాలు 'హోరు' మంటుంటే 'జోరుగా' భార్య కౌగిలిలో ఒదిగిపోతున్నా డిప్పుడు మునీంద్రా.



## 'కొత్త' ప్రేమ 'మత్తు'గా వుంది!

పూజాభట్ ప్రేమలో రిసెర్చి చేస్తున్నట్లుగా వుంది. బట్టలు మార్చినట్లు అబ్బాయిల్ని మారుస్తోందట! ప్రస్తుతం ఆమె ధర్మేంద్ర గారి రెండో అబ్బాయి 'బాబి డియోల్ ప్రేమలో గమ్మత్తులు రుచి చూస్తోంది. ఆమె పద్ధతి చూస్తుంటే పరిశ్రమలో మంచి పోటీగా మారేలా వుంది. ఇక తండ్రి చాటు పిల్లగా చెప్పుకోనవసరం లేదేమో!